క్లుప్తంగా

మూలపెద్దమ్మకు ప్రత్యేక పూజలు



గడివేముల మూలపెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన మూలపెద్ద అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు వాల్మీకిసేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు.

24న కురుబల కార్తీక వనభోజనం

గడివేముల: కురుబ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని కురువ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాపారాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రం గడివేముల మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24వ తేదీన కర్నూలు పట్టణంలోని పెదపాడు రోడ్డులో ఉన్న శ్రీ భీర లింగేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక వనభోజనంలేర్పాటు చేస్తున్నామని, కురుబలు తరలివచ్చి ఐక్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి అధ్యక్షతన నిర్వహించనున్న వనభోజన కార్యక్రమానికి మంత్రి సవితమ్మ, అనంతపురం ఎంపీ పార్థసారథి, కర్నూలు ఎంపీ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కర్నూలు(రూరల్) : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ డీఈ రవీంద్రరెడ్డి మంగళవారం పరిశీలించారు. బి.తాండ్రపాడు, బావాపురం, జి.సింగవరం గ్రామలలో మండల ఇంజినీరింగ్ అధికారి ముక్తార్ బాషా, ఏఈ విజయభాస్కర్‌తో కలిసి పర్యటించారు. రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించి నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

తూనికల్లో మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అనిత

పాణ్యం: మార్కెట్‌లో జరిగే తూనికలు, కొలతల మోసాలను నిశితంగా గమనించాలని, అప్రమత్తంగా ఉండాలని తూనికల, కొలతల అధికారి అనిత సూచించారు. పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వినయోగదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాప్‌లలో ఎలా మోసాలు గురవుతామనే విషయంపై విద్యార్థులకు వివరించారు. వస్తువులు కొన్నాక తప్పకుండా బిల్ తీసుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు అమీర్‌బాషా తెలిపారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

సి.బెళగల్: స్థానిక హౌసింగ్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం గ్రామ సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లతో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పీఎంఏవై అవాస్ ప్లస్ 2.0 గృహ నిర్మాణాల లబ్ధిదారుల గుర్తింపు సర్వే విధానాలను ఆయన వివరించారు.

శాంతిరామ్ అధ్యాపకుడికి డాక్టరేట్



వీరేష్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ అధ్యాపకుడిగా పనిచేస్తున్న వై. వీరేష్ డాక్టరేట్ అందుకున్నారు. ఈనెల 18న అనంతపురం జేఎన్‌టీయూలో జరిగిన పీహెచ్‌డీ × వివా॰ వాయిస్‌లో వీరేష్ ఎలక్ట్రిక్ వెహికల్ అనే అంశంపై ప్రసంగించారని మంగళవారం ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. ఈ ప్రసంగం వలన డాక్టరేట్‌కు ఎంపికయ్యారన్నారు. చెర్మన్ శాంతిరాముడు, డైరెక్టర్ శివరామ్, సిబ్బంది వీరేష్‌ను అభినందించారు.

మరుగుదొడ్ల వసతి కల్పించండి

సి.బెళగల్: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థులతో కలిసి ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి తదితర అధికారులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. అయితే తమ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లను వాడుకోనివ్వడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. తమకు మరుగుదొడ్డి వసతి కల్పించాలని విద్యార్థులు కోరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు ‘అపార’ కష్టాలు !

- ‘అపార్’ నమోదుకు తప్పని ఇబ్బందులు
- వివరాలు సక్రమంగాలేని వైనం
- 5,411 మంది విద్యార్థుల వివరాలలో తప్పులు
- సచివాలయాల వద్ద విద్యార్థుల పడిగాపులు



ఓర్వకల్లు సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: కేంద్ర విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘అపార్’(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు ప్రక్రియలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థుల వివరాలను నమోదు చేయడంలో ఆధార్ కార్డును కీలకం కావడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల సమగ్ర వివరాలను అపార్‌లో నమోదు చేస్తున్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆధార్ కేంద్రాలను సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం విద్యార్థికి సంబంధించి పాఠశాల రికార్డుల్లో పొందుపర్చిన సమగ్ర వివరాలు, ఆధార్ కార్డుతో పోల్చితే సమానంగా ఉండాలి. అయితే 80 శాతం మంది విద్యార్థుల వివరాలు సక్రమంగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. మిగతా 20 శాతం మంది విద్యార్థుల వివరాలను సరిచేసుకునేందుకు ఆధార్ కేంద్రాల వద్ద విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

అందుబాటులో లేని ఆధార్ కేంద్రాలు

విద్యార్థుల సంఖ్యకు సరపడా ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేక పోవడంతో విద్యార్థుల వివరాలు సరిచేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అధికారుల గణాంకాల మేరకు మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, ఏపీ గురుకుల విద్యాలయాలు కలిపి 50 పాఠశాలలు, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 23 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మొత్తం 14,558 మంది విద్యార్థులకు గాను, 9,147 మంది విద్యార్థుల వివరాలను పాఠశాల రికార్డులు, ఆధార్ కార్డుల వివరాలతో పోల్చితే సక్రమంగా ఉన్నట్లు అధికారులు తేల్చారు. మిగతా 5,411 మంది విద్యార్థుల వివరాలు అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. గత ప్రభుత్వం ఆధార్ అప్‌డేషన్ కోసం మండలం కేంద్రం ఓర్వకల్లుతోపాటు హుసేనాపురం, నన్నూరు, ఉయ్యాలవాడ గ్రామ సచివాలయాలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం ఓర్వకల్లు, హుసేనాపురం సచివాలయాల్లో మాత్రమే ఆధార్ యంత్రాలు పనిచేస్తున్నాయి. రెండు చోట్ల ఆధార్ కేంద్రాలు పనిచేయక విద్యార్థుల వివరాలను సవరణ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. రోజుకు ఒక్కో కేంద్రంలో 20–25 మంది విద్యార్థులకు మించి ఆధార్ అప్‌డేషన్ కావడంలేదని సచివాలయ డిజిటల్ అధికారులు పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 2025 మార్చి 31 నాటికి అపార్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది.

అపార్ నమోదుకు అవస్థలు

ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)లో విద్యార్థుల వివరాలను నమోదు చేయడంలో విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అపార్ ప్రక్రియ వల్ల భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో విద్యార్థుల వివరాలను గుర్తించడం సులభతర మవుతోంది. అయితే అపార్ వివరాలను ఆధార్‌తో ముడిపెట్టడంతో అడుగడుగునా ఇబ్బందులు ఎదురువతున్నాయి. ఆధార్ కార్డును గుర్తింపు ధ్రువీకరణగా మాత్రమే చూడాలని కేంద్రం స్పష్టం చేసినా, అధికారులు పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లితండ్రులు వాపోతున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిబంధనలు విద్యార్థులకు చెమటలు పట్టిస్తున్నాయి.

ఆధార్ కేంద్రాలు పెంచాలి



ప్రభుత్వం నుంచే ఏ పథకాలన్ని పొందాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి చేశారు. మండలంలో ప్రజల అవసరానికి సరిపడే ఆధార్ కేంద్రాలు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుంది. నా కుమారుడి ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుపడంతో వాటిని మార్చుకునేందుకు వారం రోజుల నుంచి ఆధార్ కేంద్రాల చుట్టు తిరుగుతున్నా. మా ఊర్లోనే ప్రయత్నం చేసినా, ఫలితం లేక ఓర్వకల్లుకు రావడం జరిగింది. ప్రజలకు అవసరం మేరకు ఆధార్ కేంద్రాలను పెంచాలి.
–హరి ప్రసాద్, విద్యార్థి తండ్రి, హుసేనాపురం, ఓర్వకల్లు మండలం

పుట్టిన తేదీ తప్పుపడింది



ఆధార్ కార్డులో మా అబ్బాయి పుట్టిన తేదీ తప్పుపడింది. మార్చుకునేందుకు తహసీల్దార్, ఆర్‌డీఓ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనికాలేదు. చివరకు ఓర్వకల్లు సచివాలయంలో రెండు రోజులుగా ప్రయత్నించగా ఆధార్‌లో పుట్టిన తేదీని సవరించారు. మార్పు చేయకపోతే భవిష్యత్‌లో ఎలాంటి సంక్షేమ పథకాలు రావనే భయం. అధికారులు స్పందించి మరిన్ని ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నానం. – మధు,
విద్యార్థి తండ్రి, పూడిచెర్ల, ఓర్వకల్లు మండలం

చాలా ఇబ్బంది పడాల్సివస్తోంది



ఆధార్ కార్డులో మార్పు, చేర్పుల కోసం చాలా ఇబ్బంది పడాల్సివస్తోంది. మండలంలో రెండు ఆధార్ కేంద్రాలు మాత్రమే ఉన్నందున కష్టాలు తప్పడం లేదు. ఆధార్ మార్పు కోసం ఇటు ఓర్వకల్లుకు వెళ్లాలన్నా.. అటు హుసేనాపురం వెళ్లాలన్నా ఇంతే దూరం. వారం రోజుల నుంచి తిరుగుతున్నప్పటికీ పనులు కావడంలేదు. అధికారులు స్పందించి మరిన్ని ఆధార్ కేంద్రాలను పెంచి, మా కష్టాలను తొలగించాలి. – ఎర్రమల, వినియోగదారుడు,
ఎస్.కొంతలపాడు, ఓర్వకల్లు మండలం

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్ : అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు బెల్ట్‌షాపుల నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశారు. మండలంలోని గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయించే వ్యక్తులను మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్‌ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం మత్తులో ఎక్కువగా గొడవలు జరుగుతున్నాయని, దీనికి బెల్ట్‌షాపులే కారణమని తెలుస్తోందన్నారు. ఎవ్వరైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే వారికి పోలీస్ ట్రీట్‌మెంట్ రుచి చూపిస్తామని హెచ్చరించారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు: పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ–2 ఓంకార్ యాదవ్ సూచించారు. మంగళవారం మండలంలోని హుసేనాపురంలోని జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటల రుచి చూశారు. ఈ సందర్భంగా ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ పాఠశాలకు హాజరైన విద్యార్థులకు మాత్రమే రేషన్ సరుకులు అందజేయాలని తెలిపారు. బోగస్ హాజరు శాతాన్ని ప్రోత్సహించొద్దన్నారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు



పాణ్యంలో బస్టాండ్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎం గంగధార్

పాణ్యం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్లు నంద్యాల ఆర్టీసీ డీఎం గంగధార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాణ్యం బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించేందుకు స్థలాన్ని డీఎం పరిశీలించారు. డీఎం మాట్లాడుతూ మరుగుదొడ్లు లేక ప్రయాణికులు ఇబ్బందుల పడుతున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల నివేదించగా అనుమతులు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఈడీఎం మద్దిలేటి నాయుడు, రూప్లానాయక్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో అజొల్లా పెంచితే లాభాలు



భూపనపాడు పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం: వరి సాగులో అజొల్లా పెంచితే ఎన్నో లాభాలు ఉన్నాయని, పొలానికి నత్రజని శాతం పెరుగుతుందని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ మురళీక్రిష్ణ రైతులకు సూచించారు. మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలో మంగళవారం ఏఓ జయప్రకాష్‌రెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మురళీ కృష్ణ పంట పొలాలను పరిశీలించారు. రైతులతో సాగు మెలకువులను వివరించారు. అనంతరం కార్యాలయంలోని వ్యవసాయ క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు అధికారి నరేంద్రకుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, జయంతి, ఉమామహేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

పరసరాల శుభ్రత పాటించాలి

సి.బెళగల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని డీఎల్‌పీఓ లక్ష్మి సూచించారు. మండలంలోని పోలకల్ గ్రామంలో మంగళవారం డీఎల్‌పీఓ పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయం – 3లో పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాజితో గ్రామంలో చేపట్టిన అంశాలు, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలో మంచి నీటి కులాయిల సరఫరాపై ఫిర్యాదులు వస్తున్నాయని, జాగ్రత్తలను తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి డీఎల్‌డీఓ సూచించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కోడుమూరు రూరల్ : గూడూరు జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ డిమాండ్ చేశారు. ఎఫ్ఎఫ్ఐ నాయకులు గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ కళాశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థినీ,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రహారీ నిర్మించాలని, మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాజా, ఆచారి, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లను ఉపయోగించాలి



కోడుమూరులో విద్యార్థులతో కలిసి ర్యాలీ పాల్గొన్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్ : ప్రజలు వ్యక్తిగత మరుగుదొడ్ల ఉపయోగించాలని కోడుమూరు ఎంపీడీఓ రాముడు సూచించారు. మంగళవారం పట్టణంలో అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మరుగుదొడ్ల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో విసర్జన వలన గాలి కలుషితమై రోగాలు వ్యాపిస్తాయన్నారు. మరుగుదొడ్లు లేని వారు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులకు దరఖాస్తు చేసుకుంటే రూ.12వేల నుంచి రూ.15వేల వరకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి



కోడుమూరు గ్రామ సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలతోపాటు గృహాలు మంజూరు చేయాలి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం కోడుమూరుతోపాటు వెంకటగిరి గ్రామ సచివాలయాల ఎదుట సీపీఐ నాయకులు ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఇంటిస్థలాలు, గృహాలు మంజూరుకు ప్రజలతో దరఖాస్తు చేయించారు. కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన వారికి స్థలాలు, స్థలాలున్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శేషుకుమార్, నాయకులు నాగేష్, ఆంజనేయులు, మద్ది, లక్ష్మిదేవి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కర్నూలు(రూరల్): కర్నూలు నగర శివారులో వెలసిన ఎల్లమ్మ అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాలను భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తుల క్యూ కట్టారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

22న ఆర్చరీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 22వ తేదీన జిల్లాస్థాయి స్త్రీ, పురుషుల టోర్నమెంట్ కమ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ సంఘం కార్యదర్శి కే.నాగరత్నమయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ఆట్యా–పాట్యా ఎంపిక పోటీలు

ఈనెల 22వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆట్యా–పాట్యా టోర్నమెంటు కమ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆట్యా–పాట్యా సంఘం కార్యదర్శి బాల పవన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఆట్యా–పాట్యా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వివరాలకు 93938 55460 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు

14 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

కర్నూలు (అగ్రికల్చర్): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 14 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం కర్నూలు ట్రాఫిక్ సీఐ ఎస్.మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో సి.క్యాంప్ సెంటర్ సమీపంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. పలువురు వాహనదారులను నిలిపి బ్రీత్ అనలైజర్‌తో పరిశీలన జరిపారు. అందులో 14 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలింది. ద్విచక్ర వాహనాలకు సంబంధించి 7, ఆటోలు 3, టాటా మ్యాజిక్ 1, కార్లు 3 మొత్తంగా 14 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. పట్టుబడిని వారిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా నగరంలో బుధవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శేషాద్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోడుమూరు రోడ్డు, ఎన్‌టీఆర్ బిల్డింగ్‌లు, ఆటోనగర్ పరిధిలోని కాలనీలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుతు సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్



రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

కోడుమూరు రూరల్ : రబీ కింద శనగ పంట సాగు చేసిన రైతులు తెగుళ్లు, పురుగుల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ రవి ప్రకాష్ సూచించారు. మంగళవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి శనగ పంటపై ।పొలం పిలుస్తోంది॰ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీ కింద రైతులు సాగు చేసిన శనగ పంట పూత దశకు చేరుకుంటుందని, పురుగు లావదశలో ఉంటే ఇమామెక్టిన్ బెంజాయ్‌ను ఎకరాకు 250గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులు గడువులోగా బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

సి.బెళగల్: సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించి పంటలను చీడపురుగుల నుంచి రక్షణ కల్పించుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. సి.బెళగల్ పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ సిబ్బందితో కలిసి ఏఓ మంగళవారం సి.బెళగల్, చింతమానుపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఆధునిక వ్యవసాయ, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను ఏఓ రైతులకు వివరించారు. పశు సంరక్షణపై పాడి రైతులకు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. పశువు పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగార్జున రెడ్డి

గడివేముల: అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని ప్యాక్షన్ గ్రామమైన పెసర వాయిలో పికెట్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అలజడులు, గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

మహిళల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలి



ఇందిరా గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ



మహిళా నాయకురాళ్లకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పాణ్యం: మహిళలకు రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని ఎంపీపీ ఉసేన్‌బీ కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడుల వలన దేశానికే అప్రతిష్టగా మారుతున్నాయన్నారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణిభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు శాఖ గ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ, మదర్ థెరిసా, సావిత్రి బాయి పూలే, సరోజినీ నాయుడు చిత్ర పటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని గ్రంథాలయ అధికారిని కౌసల్య తెలిపారు.

బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి



ఎంపీడీఓ రాణెమ్మతో చర్చిస్తున్న పోస్ట్ మాస్టర్ చంద్రశేఖర్

సి.బెళగల్: బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓతో సి.బెళగల్ అసిస్టెంట్ పోస్టుమాస్టర్ చంద్రశేఖర్ సమావేశమై బుధవారం నుంచి ఆధార్ లింగ్ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ మండలంలోని పోస్టాఫీస్‌లలో నేటి నుంచి బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.